# ప్రజావాణి దరఖాస్తులన్నింటిని సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

కరీంనగర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త ప్రతినిధి

ప్రజావాణికి సంబంధించిన ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్మితాసబర్వాల్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజావాణి దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు. ప్రజావాణిలో 5626 దరఖాస్తులు నమోదైనాయని, వీటిలో గతవారం రోజులలో 1700 దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందని, మిగిలిన దరఖాస్తులన్నింటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ప్రజలు సమర్పించే ఫిర్యాదులను, దరఖాస్తులను శాఖలవారీగా అదే రోజు సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా పంపించడం జరుగుతుందని, వాటిని పరిష్కరించాలని, దరఖాస్తు పరిష్కార పరిస్థితిని తెలుపుతూ ఆన్‌లైన్‌లో నివేదించాలని సూచించారు. గత సోమవారం 44 ఫిర్యాదులు వచ్చాయని, అందులో ఇంతవరకు 10 ఫిర్యాదులు పరిష్కారం అయినాయనీ, మిగిలిన 34 దరఖాస్తులను సంబంధిత అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రతి అధికారి పరిష్కార విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, నెలరోజుల వ్యవధిలో పెండింగ్‌లోఉన్న ఫిర్యాదులు, దరఖాస్తులు అన్ని పరిష్కారం కావాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారం విషయమై అప్‌డేషన్ చేసేందుకు శాఖలవారీగా ఇంచార్జీని నియమించి ఈ పని అప్పగించాలని పేర్కొన్నారు. ఫిర్యాదు పరిష్కారం కూడా పూర్తిస్థాయిలో న్యాయబద్ధంగా ఉండాలని, 77శాఖలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఉంచడం జరుగుతుందని తెలిపారు. అడిషనల్ జాయింట్ కలెక్టర్ సుందర్‌అబ్నార్, డిఆర్ఓ పిబి.ఆర్ ప్రసాద్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. పవర్ పాయింట్ ద్వారా ఫిర్యాదులు, దరఖాస్తులు ఏవిధంగా పరిష్కరించాలి, ఏ రితీలో ఆన్‌లైన్‌లో ఉంచాలనేది వివరించారు.

వార్త, 26/4/2011